అడవులను కాపాడుతూ..వన్యప్రాణులను సంరక్షిస్తూ..

- 4 మండలాలు 14 బీట్లు
- అగ్ని ప్రమాదాల నిరోధక చర్యలు
- అడవి జంతువుల దాహార్తికి ప్రత్యేక ఏర్పాట్లు
- వేటాడటం చట్టరీత్యా నేరం

పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతగానో సహకరిస్తాయని అందరికీ తెలిసిన విషయమే. భారీ వృక్ష సంపద కలిగిన అడవులు మానవ జీవన శైలిని మెరుగుపరుస్తున్నాయి. అంతేకాకుండా వేల రకాల ఔషధ మొక్కల ద్వారా ఆయుర్వేద మూలికలను కలిగిన వనాలు మానవాళికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి. పచ్చనిచెట్లు ప్రాణవాయువుని అందించి మనుషులను రక్షిస్తున్నాయి. అంతేనా ఎన్నో రకాల జీవరాశులకు, జంతువులు, పక్షులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి అడవులు. అలాంటి అడవులను కాపాడుకుంటూ వన్యప్రాణులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కుప్పం అటవీశాఖ అధికారి జయశంకర్ అన్నారు.

ప్రజాశక్తి- కుప్పం రూరల్

మూడు రాష్ట్రాల కూడలిలో నాలుగు మండలాలు గల నియోజకవర్గంలో 14 బీట్ల పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈఅటవీ ప్రాంతం నెమళ్లకు, చుక్కల దుప్పులకు, అడవి పందులకు, ఎలుగు బంట్లకు, ఏనుగులకు, కనితులకు, కుందేళ్ళకు, అడవి కోళ్లకు ఆశ్రయం కల్పిస్తోంది. అలాగే ఈ నాలుగు మండలాలలో అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలు ప్రజలకు జీవనోపాధినిస్తోంది. ఇదిలా ఉంటే మరోవైపు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజలు తరచూ అడవి జంతువులు తమ పంట పొలాలపై దాడులు చేయడంతో నష్టపోతునే ఉన్నారు. వన్యప్రాణుల దాడులలో పంట నష్టాలే కాకుండా, ప్రజలు తమ ప్రాణాలను పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా ఏనుగుల దాడులలో పలువురు ప్రాణాలను పోగొట్టుకోవడం స్థానికులను కలవర పరుస్తోంది. ఇలా వన్యప్రాణుల దాడుల నుండి ప్రజల ప్రాణాలను, వ్యవసాయ పంటలను రక్షించడానికి ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఇందులో భాగంగా 2014 – 19 మధ్యకాలంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అటవీ సరిహద్దు గ్రామాలలో వన్యప్రాణుల దాడులను నివారించే క్రమంలో సౌరవిద్యుత్ ప్రహరీ నిర్మించడం, కందకాలు తవ్వించడం వంటి పనులను చేపట్టింది. ముఖ్యంగా వన్యప్రాణులు తాగడానికి నీరు లేక గ్రామాలపై వస్తున్నట్లు గుర్తించిన ప్రభుత్వ అధికారులు అటవీ ప్రాంతంలో ప్రత్యేక నీటి కుంటలను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను సైతం చేపట్టారు. వీటిలో చాలా వరకు పలు కారణాల చేత ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అయితే ప్రస్తుతం వేసవి కాలం దగ్గర పడుతుండడంతో అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు వన్యప్రాణుల దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆందోళనపై కుప్పం అటవీశాఖ అధికారి జయశంకర్ స్పందిస్తూ వన్యప్రాణుల దాడుల నుండి ప్రజలను, వ్యవసాయ పంటలను రక్షించడానికి, అలాగే అటవీ ప్రాంతాన్ని పరిరక్షించుకోవడానికి ప్రత్యేక చర్యలు చేర్పడుతున్నట్లు తెలిపారు.

కుప్పం నియోజకవర్గంలో గల కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో మొత్తం 37,584 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉన్నట్టు తెలిపారు. అయితే అటవీ ప్రాంత సరిహద్దులలో వన్యప్రాణుల దాడులను రక్షించడానికి గత ప్రభుత్వ ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్ ప్రహరీ నిర్మాణం, గతంలో తవ్వించిన కందకాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో వాటిని పునరుద్ధరించడానికి, వాటి నిర్వహణకు ప్రణాళికలు రూపొందించి, ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని కుప్పం అటవీశాఖ అధికారి తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే, ఉన్నతాధికారుల అనుమతుల మేరకు సౌర విద్యుత్ ప్రహరీని పునరుద్ధరిస్తూ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, వేలాడే సౌర విద్యుత్ ప్రహరీని నిర్మిస్తామని, కందకాల పూడికలు తీయించి వన్యప్రాణుల దాడుల నుండి ప్రజల ప్రాణాలను, వ్యవసాయ పంటలను రక్షించడానికి చర్యలు చేపడుతామన్నారు.

ప్రధానంగా వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకోవడానికి జనారణ్యం లోనికి రావడం జరుగుతుందని, కావున వేసవి దగ్గర పడుతున్న నేపథ్యంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే అటవీ ప్రాంతంలో సుమారు 50 సాసరు పిట్లను ఏర్పాటు చేసి, వాటిలో ట్రాక్టర్ల సహాయంతో నీటిని నింపి వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అటవీ ప్రాంత పరిరక్షణలో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రాంతాలలో సుమారు పది కిలోమీటర్ల మేర ఫైర్ లైన్ ఏర్పాటు చేశామని, అంతేకాక ఫైర్ వాచ్ నిర్వహిస్తూ అగ్ని ప్రమాదాలను నియంత్రిస్తామని తెలిపారు. అలాగే అటవీ ప్రాంతాలు పరిరక్షించడానికి, వన్యప్రాణుల రక్షణకు ప్రజలు సైతం సహకరించాలని కోరారు. ఇందుకోసం ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాలలోని విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి అడవుల వల్ల మానవులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కళాజాతా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పలువురు హరికథ కళాకారులచే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల వ్యవసాయ భూముల పరిరక్షణకు విద్యుత్ తీగల ఏర్పాటు వంటివి చేపట్టరాదని సూచించారు. ఒకవేళ ఏనుగులు, అడవి పందుల దాడులలో పంట నష్టం వాటిలితే, ఆ రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందిస్తోందని, కావున ఏ రైతు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

అడవి జంతువుల కోసం నీటి కుంటలలో నీరు నింపుతున్న సిబ్బంది

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు (ఫైల్ ఫోటో)

కుప్పం అటవీ శాఖ అధికారి జయశంకర్

జిల్లాలో అకాల వర్షం

- సాగు రైతులకు ఆనందం
- మామిడి రైతులకు ఆందోళన

సోమలలో

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం సోమల, పెద్ద ఉప్పరపల్లె పరిసర ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుండి ఆకాశం మేఘవృతంగా ఉంటూ చల్లటి గాలులు వీయడంతో ఆహ్లాద వాతావరణం కనిపించింది. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో వీధులు జలమయమయ్యాయి.

పూతలపట్టు: మండల కేంద్రంలో కురిసిన అకాల వర్షంతో ప్రతి మంగళవారం వారపు సంతకు వచ్చే వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పశువులకు గ్రాసం లేక ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు ఈ వర్షంతో కాస్త ఉపశమనం లభించిందని అంటున్నారు.

తవణంపల్లి: మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో రైతులు ఓవైపు ఆనందంగా ఉన్నా, మరోవైపు మామిడి రైతులు గాలివానలకు ఎక్కడ పిందెదశ కాయలు, పూత రాలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. అసలే మామిడి రైతులు ధర ఉంటుందా లేదా అని ఆందోళనలో ఉండగా అకాల వర్షం వలన పూత, పిందె రాలిపోతుందని మరింత ఆందోళనకు గురి అవుతుఆన్నరు

పూతలపట్టులో అవస్థలు పడుతున్న సంత వ్యాపారులు

తవణంపల్లిలో భారీ వర్షంతో జలమయైన వీధులు

పనులు త్వరగా పూర్తి చేయండి: కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఎంపి ల్యాడ్స్ కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఎంపి ల్యాడ్స్‌తో చేపట్టిన పనుల పురోగతిపై పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపి ల్యాడ్స్ కింద పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో రూ.3.07కోట్లతో 59 పనులు మంజూరు కాగా రూ.2.17 కోట్లతో 48 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ శాఖ పరిధిలో రూ.75లక్షలతో 17 పనులు మంజూరు కాగా రూ.43.58 లక్షలతో 14 పనులు పూర్తి అయ్యాయని, మున్సిపల్ శాఖలో రూ.75.57 లక్షలతో 8 పనులు మంజూరు కాగా రూ.25.72 లక్షలతో 4 పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. వీటితో పాటు మరిన్ని శాఖలతో కలిపి మొత్తం రూ.4.84 కోట్లతో 90 పనులు మంజూరు కావడం జరిగిందని, 69 పనులు పూర్తి కాగా 59 పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపు జరిగిందని, 31 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ సమావేశానికి సిపిఓ సాంబ శివారెడ్డి, డ్వామా పీడీ రవి కుమార్, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, సంబంధిత డీఈ, ఈఈలు పాల్గొన్నారు.

మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించడమే ప్రధాన ఉద్దేశంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఈ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో మండలాల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు సకాలంలో పారదర్శకంగా అందించేలా ఉద్యోగులు సిబ్బంది పనిచేయాలన్నారు. ఉద్యోగుల సమయపాలన పాటించాలని ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువు లోపల అందించేలా కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు పీహెచ్‌సి, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, సచివాలయాల పనితీరు పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి మండల ప్రత్యేక అధికారి వారు గుర్తించిన సమస్యలను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు తెలపడం ద్వారా జిల్లా స్థాయిలో సమీక్షించడం ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దేందుకు ఇది ఒక మంచి అవకాశమని అన్నారు.

మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరెక్టర్ ఏటి రామనాథరావు మంగళవారం జిల్లా మలేరియా ఆఫీసును ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలో జరుగుతున్న మలేరియా కీటక జనత వ్యాధులపై సమీక్షించారు. జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులతో రెగ్యులర్ మానిటర్ చేస్తూ మలేరియా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి స్ప్రేయింగ్ కార్యక్రమం అవగాహన కార్యక్రమంలో పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, డాక్టర్ అనిల్ కుమార్, శ్రీవాణి పాల్గొన్నారు.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో

నేటి నుంచి మూడు రోజులు జాతీయ సదస్సు

ప్రజాశక్తి- గుడిపల్లి : ద్రావిడ విశ్వవిద్యాలయలో జానపద, గిరిజన అధ్యయనాలశాఖ వారు నేషనల్ మిషన్ ఫర్ మాన్యుస్క్రిప్ట్స్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. 'వర్తమానాన్ని అర్థం చేసుకోవడానికి గతాన్ని కాపాడుకోవడం– దక్షిణ భారతదేశంలోని జానపద, గిరిజన సంఘాల మాన్యుస్క్రిప్ట్ సంప్రదాయాలు' అనే అంశం పైన మూడు రోజులు సదస్సు జరగనున్నది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.దొరస్వామి, డాక్టర్ అనిర్బన్ డాష్, హెచ్‌సి. బోరలింగయ్య, ప్రొపెసర్ ఆర్.జయధీర్ తిరుమల్ రావు, ఆచార్య చల్లఫెరుమాళ్ పాల్గొంటారు. అలాగే ఈ మూడు రోజులు కార్యక్రమానికి జానపద విభాగాధిపతి ఆచార్య శ్యామల సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు.

హానికర ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మున్సిపల్ పరిధిలో వాడకంలో ఉన్న హానికర ప్లాస్టిక్ వస్తువులను మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పట్టణ పరిధిలో నిర్వహించిన తనిఖీలో భాగంగా దుకాణాల్లో వాడే హానికర ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు సుమారు 20 కేజీలు ఉంటుందన్నారు. రూ.5 వేలు మేర జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధం విధించి అమలులో ఉందని ప్లాస్టిక్ విక్రయాన్ని, వినియోగాన్ని ప్రతి ఒక్కరు మానుకోవాలని ఆయన సూచించారు. అలాగే హోటళ్లు, బేకరీలలో సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. తరచూ తనిఖీ నిర్వహిస్తామని ఏవైనా లోటుపాట్లు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వార్డులోను ప్లాస్టిక్ వినియోగం, ఆహార పదార్థాల విక్రయాల నాణ్యతపై ఆరా తీసేందుకు సిబ్బంది ఉంటారన్నారు. ఈ తనిఖీలో మున్సిపల్ ఏఈ హేమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, శానిటరీ సెక్రటరీ కుమార్, పీహెచ్ మేస్త్రీలు పాల్గొన్నారు.

క్షణం క్షణం ఏనుగుల భయం...

- గజదాడులతో వణికిపోతున్న అటవీ సమీప గ్రామాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గజడాడులతో అటవీ సమీపగ్రామాల్లోని రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. వేడి తీవ్రత, తాగునీరు, ఆహారం తగ్గడం, అటవీ విస్తీర్ణం తగ్గిపోవడంతో అటవీ సమీప గ్రామాలపై ఏనుగులు తరచూ విరుచుకుపడుతున్నాయి. యాదమరి, బంగారుపాళ్యం అటవీసమీప ప్రాంతాల్లోని రైతుల కష్టించి పండించిన పంటలపై ఏనుగులు ఎప్పుడు ఎటువంటి దాడి చేస్తాయో తెలీక కాపాలకాయాల్సి వస్తోంది. ఈ గ్రామంలో ఏనుగుల పడ్డాయన్న సమాచారంతో తెలియగానే ఎక్కడ పండిన పంటలను నాశనం చేస్తాయో అని రైతులు పొలాల వైపు పరుగులు పెడుతున్నారు. చిత్తూరు జిల్లాలోని యాదమరి మండలం కొట్టాల, తాళ్ళమడుగు, భూమిరెడ్డిపల్లి అటవీసమీప గ్రామాలతో పాటు బంగారుపాళ్యం మండలం వెతలచేను, టేకుమంద, కీరమంద గ్రామాలతోపాటు పలమనేరు, రామకుప్పం, గుడిపాల, సోమల, వీ కోట మండలాల్లోనూ ఏనుగులు సంచరిస్తూ పంట పొలాలను నాశనం చేస్తున్నాయి.

రాత్రి సమయాల్లో ఏనుగుల సంచారంతో ఈ గ్రామాల్లో రైతులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలపై దాడులు చేస్తున్న ఏనుగులు పంటలను తిని తొక్కి ధ్వంసం చేయడంతో పాటు అరటి, ఇతర ఉద్యాన పంటలను నాశనం చేయడంతో ఈ ప్రాంతాల్లో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ఏనుగుల నుండి రక్షణ కల్పించకుంటే పంటలు వేయలేము మహాప్రభో అంటూ అటవీశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఏటా ఏనుగుల దాడుతో పంటలు నష్టపోవాల్సి వస్తోందని సాగు పూర్తిగా మానేసి ఉపాధి కోసం చెన్నై, బెంగుళూరు నగరాల వైపు వెళ్ళాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలను నాశనం చేయడమే కాకుండా గ్రామాల సివారుల్లో ఉంటున్న వారి పాడి పశువులను, మేకలు, గొర్రెలను తొక్కి చంపేస్తున్నాయని వాపోయారు. రెండు రోజుల క్రితం బంగారుపాళ్యం మండలం వెతలచెను ప్రాంతలో ఏనుగుల దాడిలో రూ. 40 విలువ చేసే పాడి ఆవు తీవ్రంగా గాయపడ్డా నష్టపరిహారం విషయంలో పశుసంవర్ధకశాఖ వైద్యులు ఏనుగుల దాడిలో చనిపోతే తప్పా నష్టపరిహారం అందదని చెప్పడంతో ఏం చేయాలో పాలుపోక పాడిరైతు కన్నీరుపెట్టుకున్న పరిస్థితి ఏర్పడింది. ఏనుగుదల దాడులతో ఇప్పటికే ఈ గ్రామాల్లోని రైతులు అరటి, బొప్పాయి ఇతర ఉద్యానపంటలు వేయడం దాదాపు మానేశారు. ఏనుగుల దాడులనుంచి తమకు రక్షణ కల్పించాలంటూ బంగారుపాళ్యం మండలం అటవీ సమీప గ్రామాల రైతులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి కలెక్టర్, అటవీశాఖ అధికారి వినతిపత్రాలను సైతం సమర్పించారు. పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టేలా చర్యలు తీసుకోకుంటే పంట సాగును ఆపేయాల్సి వస్తుందని రైతులు తమ ఆవేదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మరో వైపు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో ఏనుగుల ట్రాన్స్‌పార్మర్లు ధ్వంసం చేయడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు పెంచడంతో పాటు పొలాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసుకొనే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఏనుగుల దాడులను అరికట్టాలంటూ డిఎఫ్ఓ కార్యాలయం వద్దకు వచ్చిన రైతులు, డిఎఫ్ఓకు వినతిపత్రం ఇస్తూ.. (ఫైల్ ఫోటోలు)

ప్రతిపాదనలు పంపాం..

- ఎస్. భరణి, జిల్లా అటవీశాఖ అధికారిణి

బంగారుపాళ్యం, యాదమరి అటవీసమీప ప్రాంతాల్లో గ్రామాల్లో ఏనుగుల కట్టడి కోసం సోలార్ కంచె ఏర్పాటు, కందకాల తవ్వకాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. జిల్లాలో ఏనుగుల సంచారం పెరిగింది. ప్రస్తుతం 120 వరకు ఏనుగుల సంచరిస్తున్నట్లు గుర్తించాం. పంట నష్టపరిహారంపై ప్రభుత్వానికి నివేదక పంపాం. అటవీశాఖ సిబ్బంది గస్తీ పెంచడం జరిగింది. ఏనుగుల సంచారాన్ని ఎప్పటికప్పుడు గుర్తించి సమీప గ్రామాల రైతులను అప్రమత్తం చేస్తున్నాం. రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు తమ గ్రామాల్లో ఏనుగుల సంచారాన్ని గుర్తించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలి.

ఆధార్ నమోదు తప్పులు లేకుండా చేయండి: డిఆర్ఓ

ఆధార్ నమోదుపై అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఆధార్ నమోదు ప్రక్రియను ఎటువంటి తప్పులు లేకుండా కచ్చితత్వంతో చేయాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డీఆర్ఓ ఛాంబర్‌లో ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్ డేషన్‌పై సంబంధిత శాఖల అధికారులకు డిఆర్ఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రతి భారతీయ పౌరునికి ఆధార్ తప్పనిసరి అని, ఆధార్‌తో చాలా అంశాలు ముడిపడి ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు ఆధార్ ప్రధానంగా ఉందని, ఆధార్ నమోదులో పొరపాట్లకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 2011 నుండి ఆధార్ నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నదని జిల్లాలో మొత్తం 226 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని, అందులో 117 గ్రామ, వార్డు సచివాలయాలు, 7 ఈ –సేవా సెంటర్లు, 9 పోస్ట్ ఆఫీసులు, 9 బిఎస్ఎన్ఎల్ ఆఫీసులు, 14 బ్యాంకులు, 34 వైద్య కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయ ద్వారా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్ డేషన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ నిరంతర ప్రక్రియగా ఉందని 5 నుంచి 7 సంవత్సరాల మధ్య వయసులో ఒకసారి, 15 నుంచి 17 సంవత్సరాల వయసు మధ్యలో మరోసారి ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి అన్నారు. గత 30 రోజుల నుండి 60,519 మందికి ఆధార్ నమోదు, అప్ డేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఎల్‌డిఓ రవి కుమార్, ఎల్‌డిఎం హరీష్, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ్, యూఐడిఏఐ రీజనల్ కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్ దామోదర్, డిస్ట్రిక్ట్ కొఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంపుకు కృషి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసిస్తున్న విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం పెంపుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నుండి సమగ్ర శిక్ష ఏపిసి వెంకట రమణతో కలసి 5వ తరగతి విద్యార్థులలో మాతృభాష తెలుగు, గణితం, తదితర పాఠ్యాంశాలలో అభ్యసన సామర్థ్యాల పెంపు పై ఎంఈఓలు, హెచ్‌ఎంలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం 5 నుండి 6వ తరగతికి వెళ్ళే విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లీష్, తదితర పాఠ్యాంశాలలో కనీస జ్ఞానం పొందేలా హెచ్‌ఎంలు, టీచర్లు కృషి చేయాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు తరచూ చర్చించాలన్నారు. రానున్న 40 రోజుల వ్యవధిలో విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యలో వెనుకబడిన 5వ తరగతి విద్యార్థుల జాబితాను మండలాల వారీగా తయారు చేసి ఎంఈఓలకు పంపడం జరుగుతుందని, సమగ్ర శిక్ష అధికారులు ఎంఈఓలు సమగ్ర ప్రణాళికలు రూపొందించి ముందు కెళ్లాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మెరుగైన విద్యను అందించడం ఒక భాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రాథమికవిద్య సమయంలో విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో కనీస జ్ఞానం లేకపోతే భవిష్యత్తులో చాలా సమస్యలను ఎదుర్కొంటారన్నారు. వెనుకబడి విద్యార్థుల కోసం పాఠశాల్లో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు.

కాంపౌండ్ వాల్‌కు రూ.40 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి జెడ్పి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు అయ్యాయి. మండల కేంద్రంలోని జెడ్పి హైస్కూలుకు కాంపౌండ్ వాలు లేకుండా విద్యార్థిని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే 40 లక్షల రూపాయలు కాంపౌండ్ వాల్‌కు మంజూరు చేశారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. స్కూలు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
'ప్రజాశక్తి' వార్తకు స్పందన

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించిన అధికారులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: 'కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు.. స్పందించని అధికారులు' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ ఉన్నతాధికారులు సోమవారం ఆ రైతుకు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో వెదురుకుప్పం ఎఇ రంగనాథం తన సిబ్బందితో కలిసి పచ్చికాపల్లం పేట గ్రామానికి చెందిన కేశవుల రెడ్డి పంట పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమస్యను పరిష్కరించినందుకు ఆ రైతు ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలిపారు.

జ్యోతి వెలిగించి క్రీడలు ప్రారంభిస్తున్న ఎంఈవో విజయకుమార్

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడలతో ఎంతో అవసరమని మండల విద్యాశాఖ అధికారి ఎం విజయకుమార్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన స్పోర్స్ డేను ఎంఈవో విజయకుమార్, హెచ్‌ఎం వాసుదేవరెడ్డిలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. గొప్ప గొప్ప వ్యక్తులు క్రీడల్లో రాణిస్తూ గొప్ప వారీగా సముచిత స్థానం పొందారని గర్తు చేశారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఉల్లాసంగా గడిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిచంద్రారెడ్డి, మోహన మురళీ, శ్రీనివాసులు, సుజల, బాబు, భీమారావు, చలపతిరావు, రవిశేఖర్, సత్యవతి, తిరుమలే, శేఖర్, మధు. హరిప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కు అందజేత

చెక్కు అందిస్తున్న పశు వైద్యాధికారులు

ప్రజాశక్తి -సోమల: పాడి ఆవును కోల్పోయిన ఓ మహిళా రైతుకు అధికారులు మంగళవారం నష్టపరిహార చెక్కును అందించారు. సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పార్వతీ నగర్‌కు చెందిన కృష్ణవేణికి చెందిన పాడి ఆవు గత ఏడాది డిసెంబర్ 3వ తేదీ మండలంలో తుపాన్ కారణంగా భారీ వర్షంలో చిక్కుకుని మృతి చెందింది. విషయం తెలుసుకున్న పశువైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం 37,500 రూపాయల నష్టపరిహారాన్ని మంజూరు చేసింది. మంగళవారం పశు వైద్య సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, పశు వైద్యాధికారిణి చందన ప్రియలు మహిళా రైతుకు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పశువులు కలిగిన రైతులు తప్పకుండా తమ పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తద్వారా పశువులు ప్రమాదాల కారణంగా మరణిస్తే నష్టపరిహారం అందించే అవకాశం వుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం: సర్పంచ్

ప్రజాశక్తి -కార్వేటినగరం: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ తులసి అన్నారు. మంగళవారం డీఎం పురం లో సర్పంచ్ తులసి, ఎంపీటీసీ ధనశేఖర్ యాదవ్, తడి చెత్త, పొడిచెత్త వేరు చేయ డానికి రెండు రకాల బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వీధుల్లో మురుగునీరు లేకుండా చూడాలని, పేడ దిబ్బలను రోడ్లపై వేసి రోగాలకు కారకులు కావద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ కృష్ణయాదవ్, పంచాయతీ కార్యదర్శి గోపి, పలువురు పాల్గొన్నారు.

బుట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సర్వే తనిఖీ

ప్రజాశక్తి - యాదమరి: రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కమ్యూనికబుల్ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ సర్వేను జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ప్రవీణ, యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సంత గేటు లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సర్వేపై పలు అనుమానాలు వస్తున్న నేపథ్యంలో డాక్టర్ ప్రవీణ రాండంగా యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంత గేటు గ్రామాన్ని ఎంచుకొని అక్కడ సర్వే చేపట్టారు. సర్వే సమయంలో ఇంటి దగ్గర లేని వారిని చనిపోయిన విధంగా గ్రామం వదిలి వెళ్లినట్లుగా పలు ప్రాంతాల్లో నమోదు చేస్తున్న నేపథ్యంలో రాండంగా తనిఖీ చేసే నిమిత్తం వచ్చినట్లు డాక్టర్ పేర్కొన్నారు. ఎన్సీడీ సర్వే వంద శాతం పూర్తి చేస్తేనే రోగులకు ప్రజలకు సరిపడా మందులు వైద్య సేవలను ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని, ఈ సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని తనిఖీలు చేపడుతున్నామన్నారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తనిఖీ సమయంలో డిపిఎంఓ రాండంగా తనిఖీ నిర్వహించి సంతృప్తిని వ్యక్తం చేశారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అన్నిచోట్ల సర్వే పగడ్బందీగా చేపట్టాలన్నారు ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో లక్ష్మీ నారాయణ , సూపర్వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జాబ్ మేళా విజయవంతం

- నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యం
- ఉద్యోగ కల్పనలో మొదటి అడుగు
- కడా పీడీ వికాస్ మరమ్మత్

మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మరమ్మత్

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని కడా కార్యాలయ ఆవరణలో మంగళ వారం 1 ఎం 1బి సంస్థ ఏర్పాటు చేసిన జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. కడా పీడీ వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గం నుండి నిరుద్యోగులు పెద్ద ఎత్తున బెంగళూరు నగరంలో కూలి పనులు చేసుకోలేక వలస వెళ్లారని, పట్టభద్రులై, నైపుణ్యత కలిగిన యువత సైతం ఎక్కువమంది కూలి పనులకు వెళ్లడం బాధాకరమన్నారు. వాటిని నిర్మూలించడానికి నియోజకవర్గ పరిధిలో కడా ఆధ్వర్యంలో 1ఎం 1బి వారు తొలిసారి జాబ్ 'ను నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా పరిధిలోని నిరుద్యోగులు సుమారు 700 మందికి పైగా హాజరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, వారి అర్హతకు తగ్గ ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా 700 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తుందన్నారు. నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా, యువతకు ఉద్యోగాలు కల్పించడానికి తొలిసారి నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమం విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి, యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలను అందుబాటులోనికి తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. యువత సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నివాళులర్పిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ యుగంధర్ పొన్న

మాజీ ఉప సర్పంచ్‌కు నివాళి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురు కుప్పం మండలం మొండి వెంగనపల్లి గ్రామ పంచాయతీ బలిజ మొండి వెంగన్నపల్లి గ్రామానికి చెందిన చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ తండ్రి పోటుగారి శంకరయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ యుగంధర్ పొన్న ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వెదురుకుప్పం మండల అధ్యక్షులు పురుషోత్తం, నియోజకవర్గం బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, వెదురుకుప్పం మండల యువజన నేత సతీష్, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, వెదురుకుప్ప మండల యువజన చందు, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్ , కార్వేటి నగరం మండల అధ్యక్షులు విజయ్, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ చంద్రమౌళి, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు వెంకటేష్ టౌన్ విస్ ప్రెసిడెంట్ సూరి, సునీల్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: కలెక్టర్ కార్యాలయం నేడు న్విహించనున్న యువత పోరు పోస్టర్ ను గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి కృపా లక్ష్మి పుత్తూరు కార్యాలయం మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల మాదిరే రాష్ట్రం లోని విద్యార్థులను మోసం చేసిందని కాలేజీలకు సకాలంలో ఫీజు రీయింబర్స్ మెంటు సొమ్ము చెల్లించక పోవడంతో యజమానులు విద్యార్థులను కాలేజీల నుండి వెళ్లగొడుతున్నారని, ఈ ప్రభుత్వం పేదపిల్లల జీవితాలతో ఆటలు ఆడుతోందని దీనికి నిరసనగా బుధవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసనకు అందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సబ్సిడీ బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి -గుడుపల్లి: గుడిపల్లి మండలంలో సబ్సిడీ ద్వారా బ్యాటరీ సైకిళ్లను వెలుగు కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు బాబు నాయుడు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. మండలంలో 502 మంది లబ్ధిదారులకు సైకిళ్ల పంపిణీ చేశారు. కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ఇలాంటి బ్యాటరీ సైకిలును పంపిణీ చేశామని ఆయన తెలిపారు. దీంతో లబ్ధిదారులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణి, మహిళా నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, యూనిట్ ఇన్‌ఛార్జ్ ప్రకాష్, బిజెపి నాయకుడు రామచంద్ర పాల్గొన్నారు.

బ్యాటరీ సైకిళ్లు పంపిణీ చేస్తున్న బాబునాయుడు

మహాధర్నాకు కార్మిక నాయకులు తరలి రండి..

ప్రజాశక్తి -గంగవరం: నేడు విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు నియోజకవర్గ నుండి పలు ప్రజా సంఘాలు, కార్మిక నాయకులు అధిక సంఖ్యలో బయలుదేరుతున్నట్లు మండల వ్యవసాయ సంఘం అధ్యక్షులు పాకాల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పభుత్వ భూములు వెంటనే పంచాలని నిరుపేదలకు పక్కా గృహాలను నిర్మించడానికి కృషి చేయాలని ఉపాధి కూలీలకు వేతనాలు పెంచడంతో పాటు కూలి దినా లు పెంచాలని, నియోజకవర్గం లోని ప్రతి దళితులకు ప్రత్యేక శ్మశాన వాటికలు కేటాయించాలన్న అంశాలపై నిరసన వ్యక్తం చేసి రెండు రోజులు పాటు సమావేశం ఉంటుందని, ప్రతి కార్మిక నాయకుడు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇంటర్ పరీక్షకు 18 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రం సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 131 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా113 మంది విద్యార్థులు హాజరయ్యారని 18 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు తెలిపారు.

సుశీల్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి పట్టణానికి చెందిన డి.సుశీల్ భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫార్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ నుంచి సామాజిక సేవకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఎంఎస్ చేసి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉన్న సుశీల్ స్వదేశంలోని పలువురికి విద్యార్జనకు, క్రీడల్లో రాణించడానికి సహకరించడంతో పాటు, అనారోగ్యం పాలైన వారికి సాయం అందిస్తూ సామాజిక సేవచేస్తుండడాన్ని గుర్తించిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫార్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ ఆయనకు సామాజికసేవలో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బెంగుళూరులో యూనివర్సిటీవారు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అతిచిన్న వయస్సులో ఈ అవార్డు అందుకున్న యువకుడు కావడంతో పలువురు అతనికి ప్రశంసలు అందజేశారు.

ఘనంగా మేయర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర మేయర్ ఎస్.అముద జన్మదిన వేడుకలు నగరపాలక కార్యాలయంలో మంగళవారం వేడుకగా జరిగాయి. నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ మేయర్‌కి పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక పరిధిలో ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులు, మేయర్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా టిడిపి అడుగులేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వారిలో చైతన్యం, ఆత్మస్థైర్యం కల్పించారని టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమెన్ ఫర్ ఉమెన్ బై ఉమెన్ కార్యక్రమంలో భాగంగా లక్షకు పైగా డ్వాక్రా ఉత్పత్తులను రికార్డు స్థాయిలో విక్రయించారని, 7,471 మంది పట్టణ పేద మహిళలకు రూ.645.52 కోట్లు బ్యాంకు రుణాల్ను పంపిణీ చేశారని తెలిపారు. ఉత్పాదక రుణ పథకం కింద రూ.1,826.43 కోట్లు, లక్షా 43 వేల మంది గ్రామీణ మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా స్త్రీ నిధి కింద రూ.1,000 కోట్లు అందించారన్నారు. టిడిపి నాయకులు సప్తగిరి ప్రసాద్, సురేంద్రకుమార్, మాహన్‌రాజ్ పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక వేధింపుల నివారణకు శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పిల్లలపై లైంగిక వేధింపులు ఏ విధంగా నివారించాలనే అంశంపై లైన్ డిపార్ట్మెంట్, ఐసిడిఎస్, పంచాయతీరాజ్, పోలీస్, ఎన్జీవోలకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ పిల్లలపై లైంగికదాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు మనందరిపై కూడా ఉందని, దీనిపై సమాజం జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సైకాలజిస్ట్ అరిషా పాల్గొని వారి అమూల్యమైన సందేశాన్ని అందించారు. లైంగిక దాడుల నుంచి పిల్లలను ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తప్పక అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ గిరి, డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, చిన్నపిల్లల డాక్టర్ దుర్గ ప్రసాదరావు, స్వామీదాస్, వివిధ లైన్ డిపార్ట్మెంట్ వారు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి..

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: తమకు తాగునీటి సమస్య ఏర్పడిందని వెంటనే పరిష్కరించాలని కార్వేటినగరం మండలం ఆర్‌కెవీబీ పేట గ్రామ పంచాయతీ వాసులు కోరారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ కార్వేటినగరం మండలం ఆర్‌కెవీబీ పేట గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న వీధిలో 70కి పైగా ఇళ్లు వున్నాయని, ఈ కుళాయికి నీరు అందక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు పలుమార్లు సమస్యను తెలిపినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరిం చకపోతే కలెక్టర్ కార్యాల యానికి బిందెలతో ర్యాలీ నిర్వహి స్తామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపా మన్నారు.

ఎంపిడివో వివరణ

ఆర్‌కెవిబిపేట గ్రామ పంచాయ తీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపిడివో చంద్రమౌళి తెలిపారు.

కార్వేటినగరం: తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ఆర్వేవీబీపేట గ్రామానికి బోరు ఏర్పాటు చేసి తాగునీరు అందించామని ఈవోపీఆర్‌డి నాగరత్నమ్మ తెలిపారు. మంగళవారం ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉన్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

మహిళల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెదురుకుప్పం డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద ఆధ్వర్యంలో మహిళల హక్కులు, సాధికారతపై మంగళవారం అవగాహన కల్పించారు. మహిళా సాధికారత విభాగం డాక్టర్ ఎస్ రుష్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి మంగళ గౌరీ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటేష్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత, హక్కులు, విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలతో మహిళా ప్రాముఖ్యతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతను ప్రోత్సహించడంలో విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి లక్ష్మీ ప్రసన్న లత, డాక్టర్ ఏసి భరణినాథ్‌రెడ్డి, డాక్టర్ వి ప్రభాకర్ రావు, డాక్టర్ కె శంకర్ రెడ్డి , అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

దానధర్మాలకు ప్రతీక రంజాన్
-ఐదు వందల మందికి చీరలు వితరణ

ప్రజాశక్తి -కార్వేటినగరం: దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ అని జీడీనెల్లూరు నియోజకవర్గం వైసిపి సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం కార్వేటి నగరంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తౌఫీరాన్ ఆధ్వర్యంలో కృపాలక్ష్మి చేతుల మీదుగా ఐదు వందల మందికి చీరలు, పంచెలు వితరణ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం కన్వీనర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు పవిత్రంగా భావించే రంజాన్ పండుగ దాన ధర్మాలకు ప్రతీకకగా నిలుస్తోందన్నారు. ముస్లిం సోదరులు నిత్యం యావత్తు ప్రపంచ శాంతి సంతోషాల కోసం ప్రార్థనలు చేస్తారన్నారు. రంజాన్ మాసంలో తనకు ఉన్నంతలో పేదలకు దాన ధర్మాలు చేస్తూ తన ఉన్నతిని చాటుకుంటారని పేర్కొన్నారు. అలాంటి వారిలో సుబాఖాన్, హమీదాఖాన్ ఒక్కరని ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ముస్లిం సోదరలకు చీరలు, పంచెలు వితరణ చేసి తన దానగుణాన్ని చాటుకోవడం తరతరాలు వస్తున్న ఆనావాయితీ అన్నారు. గతంలో సుబాన్ ఖాన్ ప్రభుత్వ పాఠశాలను దత్తతకు తీసుకుని విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, నోటు పుస్తకాలు, పాఠ్యసామగ్రిని అందించే వారని తెలిపారు. వారి వారసులు తౌఫీరాన్ చిన్న వయస్సులోనే అదే బాటలో నడుస్తూ పేదలకు దానధర్మాలు చేస్తూ వారి వారసత్వాన్ని నిలుపుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, రాష్ట్ర రైతువిభాగ కార్యదర్శి చందురాజు, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి. మైనారిటీ పట్టణ అధ్యక్షుడు రఫీ, సద్దాం, ముస్తాఫ్, సబ్బీర్ హిషాన్, పలువురు యువత పాల్గొన్నారు.

కృపాలక్ష్మి చేతులు మీదుగా దుస్తులు వితరణ చేస్తున్న దృశ్యం

మోసగించడానికే యువత పోరు: టిడిపి

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : రాష్ట్రంలోని యువతను మరోసారి మోసగించడానికి జగన్మోహన్ రెడ్డి యువత పోరు నిర్వహిస్తున్నట్టు తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి ఆరోపించారు. వైసిపి యువత పోరు కార్యక్రమానికి పిలుపునివ్వడాన్ని ఖండిస్తూ కుప్పం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వెంకటేష్ స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికలలో అధికారం చేపట్టడమే లక్ష్యంగా వైసిపి యువతను సంక్షేమానికి ఎన్నో రకాల హామీలు ఇచ్చిందని అనంతరం రాష్ట్రవ్యాప్తంగా యువతని నట్టేట ముంచారని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమ పథకాలను సైతం నిలిపివేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి తన హయాంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం యువత సంక్షేమానికి ప్రణాళిక బద్ధంగా శ్రమిస్తున్నట్టు తెలిపారు. మంత్రి లోకేష్ విద్యార్థుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. మరో సారి మోసగించేందుకు ప్రయత్నిస్తున్న జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపు నిచ్చారు. వైసీపీకి యువత బుద్ధి చెప్పడా నికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపి అధ్యక్షులు రాజేంద్ర, రవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
జిల్లా శిక్షణ అధికారి సందీప్

రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి - యాదమరి: రైతులు మారుతున్న కాలంతో పాటు ఆధునికత సాంకేతికత అందిపుచ్చుకో వాలని తద్వారా యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని శిక్షణాధికారి సందీప్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరం లో రైతు సేవా కేంద్రం సిబ్బందికి, రైతులకు స్కిల్ అప్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ లో భాగంగా శిక్షణ ఇచ్చారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఈ శిక్షణలో స్మార్ట్ ఫోన్ ఉపయోగించి వాతావరణ సమాచారం తెలుసుకోవడం, తద్వారా వాతావరణ సమాచారానికి అను గుణంగా వ్యవసాయ పనులు చేపట్టడం , వివిధ మార్కెట్ ల లో వివిధ పంటల ధరల గురించి తెలుసుకొని ఏ మార్కెట్ లో ఎక్కువ ధర ఉందో అక్కడ తమ పంట అమ్ముకోవచ్చని తెలిపారు. పంటలకు సంబంధించి యూ ట్యూబ్ లో సమాచారం తెలుసుకొనే విధానం, వివిధ రకాలైన యాప్ లు ప్లాంటిక్స్ వ్యవసాయం, అగ్రి సెంట్రల్ వంటి వాటిని ఉపయోగించి పంటల యాజమాన్య పద్ధతులు, చీడ పీడలు గుర్తించడం వాటి నివారణ పద్ధతులు తెలుసుకోవడం గురించి, మార్కెటింగ్ వివరాలు కూడా పూర్తి గా తెలుసుకోవచ్చని అవగాహన కల్గించడమైనది. రైతులకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చే యూ ట్యూబ్ ఛానల్స్ అయిన పాడిపంటలు, రైతు నేస్తం, అన్నదాత, రైతు బడి, తదితర వాటిపై అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన అధిక దిగుబడి నిచ్చే నూతన యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతికతను అలవచ్చుకుని అధిక లాభాలు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమం లో శిక్షణ అధికారి నదీమ్, పర్యవేక్షక అధికారి ఉమామహేశ్వరీ, స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE DISTRICT MUNSIF CUM JUDICIAL MAGISTRATE AT PALLAVARAM
D.V. No.11 of 2024

A R Rahima Yasmin, D/o. Abdul Rawoof, No:4, 2nd Street, 7th Main Road, New Colony, Chrompet. 600044.
... Complainant / Aggrieved Person / wife

Vs.

1. Sheik Ameer Faizal, **... Respondent / Husband**
2. Maqsood Ali., **... Respondent / Father in Law**
3. Reshma, **... Respondent / Mother in Law**
4. Affrin, **... Respondent/Sister in Law**

All are residing in 2-475/9, Pillar Kovil Street, Konga reddy palli, Chitoor - 517001, Andra Pradesh(AP).

NOTICE

Take notice that the Complainant filed DVC No. 11 of 2024 before the Hon'ble District Munsif Cum Judicial Magistrate, at Pallavaram, Chengalpattu District, State of Tamil Nadu for protections under the Domestic Violence Act. As the complainant have taken several Court summon as well as Private Notice to the respondents to appear before the Hon'ble Court and the Hon'ble Court has been pleased to order paper publication to you, returnable by 24.03.2025. Kindly be present before the Said Court on 24.03.2025 at 10.30 am in person, failing which the above matter will be heard and decided in your absence.

A R Rahima Yasmin, Complainant.

సారా విక్రయిస్తున్న మహిళపై కేసు

ప్రజాశక్తి - వెదురుకుప్పం, కార్వేటినగరం: మండలంలో అక్రమ సారాను వ్యాపారులకు సరఫరా చ్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు చిత్తూరు ఎన్‌ఫోర్సుమెంటు సీఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వెదురుకుప్పం మండలంలో ఎన్‌ఫోర్సు మెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమినర్ శ్రీనివాసాచారి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి మండల పరిధిలోని వేణుగోపాలపురం దళితవాడలో దాడులు నిర్వహించి బి గోపాల్ వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అతనిపై కేసునమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టగా వెదుకుప్పం మండంలోని యనమల మంద దళితవాడకు చెందిన నవనీతం వద్ద నుంచి సారా తీసుకొచ్చినట్లు చెప్పడంతో యనమల మంద గ్రామానికి చెందిన నవీనతపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఏఎస్ఐ కే సుబ్రహ్మణ్యం, హెడ్ కానిస్టేబుల్ మునిసుందరం, సిద్దయ్య, సురేంద్రబాబు, రాజేష్ విజయ్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - రామకుప్పం: స్థానిక గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అరుణ్, కార్తీక్ సోమవారం కనిపించ కుండా పోయారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ రామకుప్పం పోలీసులను ఆశ్రయించారు. కాగా ఈ ఇద్దరు విద్యార్థులు సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున వీర్నమలకు బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యమైన గురుకుల మడుగు గ్రామం వద్ద స్థానికులు గుర్తించారు. విషయాన్ని తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారిద్దరి సమక్షంలో గురుకుల పాఠశాలలో విద్యార్థులను అప్పగించారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మరుగుదొడ్ల ఆవశ్యకతపై మంగళవారం మండలంలోని రాయలపేట, కోగిలేరు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డీఎల్ డీఓ (డివిజనల్ డెవలప్మెంట్ అధికారి), పెద్దపంజాణి మండలం ప్రత్యేక అధికారి వెంకటశేషయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య విషయాలపై విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలని, భోజనానికి ముందు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఆరుబయట మలవిసర్జన చేయకూడదని, అలా చేయడం వల్ల రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. . తల్లి తండ్రులకు అవగాహన కల్పించి, ప్రతి కుటుంబానికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకోని,ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి సుజాత, ప్రధానోపాధ్యాయుడు లోకేష్,ఉపాధ్యాయులు, ఎంసిఓ సుధాకర్ పాల్గొన్నారు

పార్టీని బలోపేతం చేయాలి
వైసిపి రాష్ట్ర మేధావుల సంఘం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి


మాట్లాడుతున్న జగదీశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి- పూతలపట్టు: ప్రస్తుతం ఉన్న తరుణంలో వైసిపిని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని అందుకు తగ్గట్టుగా తాము పని చేస్తామని వైసిపి రాష్ట్ర మేధావుల సంఘం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిష్టానం ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వైసీపీ కార్యకర్తలను కాపాడుకోవడం ఎంతో అవసరం ఆ దిశగా అడుగులు వేస్తామంటూ.. పార్టీ నాయకులను కార్యకర్తలను కలుపుకొని పనిచేస్తామని ఆయన తెలిపారు.

ఉచిత మెడికల్ క్యాంప్

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజా శక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పలమనేరు పట్టణానికి చెందిన సాయిరాం మల్టీ స్పెషాలిటీ వైద్యులు యుగంధర్, తరంగిణిల ఆధ్వర్యంలో మొరం వద్ద ఉన్న దొడ్ల డైరీ నందు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఉద్యోగులు , సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ, జీవితంలో డబ్బు సంపాదించడమే కాదు సమాజ సేవకు కూడా స్థానం కల్పించాలని ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతు న్నామని తెలిపారు. వీరి కృషికి పలువురు ప్రజలు హ్యాట్సాఫ్ తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు సన్మానం

ప్రజాశక్తి-పలమనేరు: మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. పలమనేరు నియోజకవర్గం నడింపల్లిలో రిమ్స్ వికలాంగుల స్కూలులో మహిళా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, రిమ్స్ ప్రిన్సిపల్ తనుజ సిబ్బంది, పలువురు మహిళలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు విశ్వనాథం శెట్టి ఉప్పు శెట్టి, సీతారామాంజనేయ భక్తి మండలి, పలమనేరు నాయకురాలు ఉప్పుశెట్టి కుమారమ్మ, ప్రేమలీల, వాణి పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో మురళీధర్ రెడ్డి తెలిపారు. బీసీ, కాపు, తెగల, బలిజ, కమ్మ, రెడ్డి ,ఆర్యవైశ్య తదితర కులాల మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి 75 శాతం పైగా సబ్సిడీ ద్వారా కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయము, కాణిపాకం.

రిక.నెం.14/2025 **తేది:11-03-2025**

బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఐరాల మండలం, కాణిపాకం గ్రామ పంచాయతి మరియు కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానమునకు సంబందించిన స్థలముల యందు నిలపబడిన వాహనముల నుండి పార్కింగ్ ఫీజు వసూలు వేలము 01-04-2025 నుండి 31-03-2026 వరకు రుసుములు వసూలు చేసుకొను గుత్తహక్కును పొందుటకు గాను కాణిపాకం గ్రామ పంచాయతి కార్యాలయము నందు 19/03/2025 వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి 11.00 గంటల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. తదుపరి 11.00 గంటల నుండి కాణిపాకం గ్రామ పంచాయతి కార్యాలయము నందు పంచాయతి కార్యదర్శి వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు సీల్డు టెండరు నందు మరియు బహిరంగ వేలము నందు హెచ్చుపాట ఏదైతే దానినే పరిగణలోనికి తీసుకొనబడును. వేలములో పాల్గొనదలచిన వారు మరియు సీల్డు టెండరు దాఖలు చేయువారు రూ. 15,00,000/-లు డిపాజిట్లు మరియు రూ. 5,00,000/- లు మదింపు ధృవపత్రమును, మదింపు ధృవపత్రము లేని వారు రూ.20,00,000/- లు డిపాజిట్ చెల్లించవలయును. డిపాజిట్లు పంచాయతి కార్యదర్శి, కాణిపాకం వారి పేరు మీద జాతీయ బ్యాంకులు నుండి డిమాండు డ్రాఫ్టు తీసుకుని, కాణిపాకం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీ నందు చెల్లుబాటు అయ్యే విధముగా వేలమునకు ముందుగా అందజేయవలయును. వేలములో పాల్గొన దలచిన వారు గ్రామపంచాయతికి ఎటువంటి బకాయిలు ఉండరాదు. వేలములు ఖాయ పరచుట గ్రామ పంచాయతి వారి ఆమోదమునకు లోబడి యుండును. హెచ్చుపాటదారుడు వేలము ముగిసిన ఏడు రోజులలోపుగా డిపాజిట్ పోను మిగిలిన మొత్తమును డిమాండు డ్రాఫ్టు, చలాన రూపములో పంచాయతి ఖాతాకు చెల్లించవలయును. పార్కింగ్ ఫీసు వసూలు రేట్లు , పార్కింగ్ స్థలముల వివరములు షరతులు మరియు ఇతర విషయములు కార్యాలయపు పనివేళలయందు తెలుసుకొనవచ్చు, ఏ కారణములు తెలుపకనే వేలమును రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు పంచాయతి కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.

గమనిక: 1. సీల్డు టెండరు షెడ్యూలు ఖరీదు రూ 500/-, 2. సీల్డు టెండరు కొరకు దరఖాస్తు స్వీకరణ తేదీ మరియు సమయము 13/03/2025 మరియు 15/03/2025 ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు , 3. టెండరు షెడ్యూలు పొందు తేదీ మరియు సమయం 17/03/2025 మరియు 18/03/2025 ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు , 4. టెండరు షెడ్యూలు బాక్సు నందు దాఖలు చేయు తేదీ మరియు సమయము 19/03/2025 ఉదయము 10.00 గంటల నుండి 11.00 గంటల వరకు.

శ్రీమతి యన్.కుసుమ కుమారి
పంచాయితీ కార్యదర్శి I/C,
గ్రామపంచాయితీ,
కాణిపాకం,
ఐరాల(మం),
చిత్తూరు జిల్లా.

శ్రీకె.యస్. శాంతి సాగర్ రెడ్డి
సర్పంచ్,
కాణిపాకం,
గ్రామపంచాయితీ,
ఐరాల(మం),
చిత్తూరు జిల్లా.

శ్రీ పెంచల కిషోర్
కార్యనిర్వహణ అధికారి
మరియు డెప్యూటీ కలెక్టర్
స్వయంభు శ్రీ వరసిద్ధి
వినాయకస్వామి దేవస్థానం,
కాణిపాకం,ఐరాల(మం),
చిత్తూరు జిల్లా.